# కొడుకులు – కూతుళ్ళు

ఈమధ్య ఎన్నారై కబుర్ల పాఠకులు ఒకళ్ళిద్దరు నాతో ఇంటర్నెట్ చాటింగ్ మొదలుపెట్టారు. సమయం దొరికి నప్పుడల్లా వాళ్ళతో మాట్లాడుతూనే వున్నాను. విశాఖపట్నంనించీ ఒకాయన ఒక విషయం తీసుకు వచ్చారు.

'మొన్నీమధ్య ఒక తెలుగు సినిమా రిలీజయింది. దాంట్లో హీరో ఒకనాటి హీరోకి మనవడు. ఆ హీరో కొడుకులూ మనవళ్ళూ సినిమాల్లో వేస్తున్నారులెండి' అన్నాడు.

'దాంట్లో తప్పేముంది. మంచి నటులయితే సరి' అన్నాను. అమెరికాలోనూ కర్క్ డగ్లస్ అనే గొప్ప నటుడి కొడుకు మైకెల్ డగ్లస్ వున్నాడు కదా, చాల మంచి నటుడు అని మనసులో అనుకుంటూ.

'అదికాదు. పోస్టర్లమీదా పేపర్లలో ఇతని తాత బొమ్మ వేస్తారు, సినిమాలో లేకపోయినా. ఆయన పేరు మీదా పబ్లిసిటీ మీదా నడుస్తాయాయనేమో. ఇదొక్కటే కాదు ఇలా ఎంతోమంది కొడుకులూ కూతుళ్ళూ మనవలూ, తెలుగు తమిళ్ హిందీ లో మా ప్రాణాలు తోడేస్తున్నారు. ఎవరో ఒకళ్ళిద్దరు తప్ప మిగతా వాళ్ళకి నటశూన్య బిరుదివ్వాలి. కానీ ఒకటి మాత్రం ఒప్పుకోవాలిలెండి. ఎంత కొడుకులూ కూతుళ్ళూ అయినా ఆ సినిమాలని మాత్రం తిప్పికొట్టేస్తున్నారు జనం' అన్నాడు అతను.

'అవును. సినిమా పెద్ద వ్యాపారం కదా. కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమా నష్టం తెప్పిస్తుంటే, ఎంత చుట్టరికాలూ అభిమానాలు వున్నవాళ్ళయినా ఎంత కాలం భరిస్తారు. ఒకసారి. రెండుసార్లు. నల్ల డబ్బులు ఎక్కువగా వుంటే ఇంకా కొన్నాళ్ళు. తరువాత?' అన్నాను.

'వీళ్ళు డైలాగులు చెబుతుంటే వినాలి మీరు. సగంమందికి మాట్లాడటం, అంటే సరిగ్గా ఒత్తులు పలుకుతూ మాట్లాడటం రాదు. అయినా కొంతమందికి పాటలే కాదు మాటలు కూడా నేపథ్యం చెప్పే వాళ్ళున్నారులెండి. డాన్సుల పేరుతో కుప్పిగంతులూ, కోతి వేషాలూ వేయగలిగితే చాలు హీరోలయిపోతారు' ఆ రోజే ఏదో చెత్త సినిమా చూసి వచ్చాడేమో తన కసి అంతా తీర్చుకుంటున్నాడు.

నేనూ ఈమధ్య తెలుగు సినిమా చూసి చాల నెలలూ, హిందీ సినిమా చూసి చాల ఏళ్ళూ అయిందేమో ఇక ఏం వ్రాయాలో తెలీక, గుడ్ బై చెప్పాను.

అప్పుడే గుర్తుకి వచ్చింది. ఒకసారి అమెరికా వచ్చిన ఒక ప్రముఖ తెలుగు సినిమా దర్శకుడితో మాట్లాడుతున్నప్పుడు తెలుగు సినిమాల్లో దిగజారిపోయిన భాషా సౌందర్యం గురించి మాట్లాడుకున్నాం. తెలుగు భాష ఎంత దిగజారిపోయిందీ ముఖ్యంగా కొన్ని మాటల వాడుక ఎలా బాధ పెట్టిందీ. మరి కాలేజీలో చదువుకునే హీరో హీరోయిన్లు వచ్చుద్ది, పోద్ది, ఏంటి, ఏంటే, ఒసే, పగిలిపోద్ది అంటుంటే మరి నాలాటి తెలుగు భాషాభిమానులకు చురుక్కుమనదూ! ఒక సినిమాలో అయితే హీరోయిన్ హీరోని కాలేజీ క్లాస్ రూం ముందర 'ఏరా ఒల్లు తిమ్మిరిగా వుందా'

అంటుంది. మెడలో స్టెతస్కోపు వేసుకున్న హీరో 'నా ఒల్లు కాదు. నీ ఒల్లే. నేను మంచోన్ని. అగమానించక' అన్నాడు.

మేమిద్దరం ఒక ప్రముఖ నటుడి గురించి మాట్లాడుకుంటునప్పుడు ఆ దర్శకుడ్ని అడిగాను, 'ఈ హీరోకి అసలు ఒత్తులే పలకవేమిటండీ. మధురానుభూతులు అనటానికి మదురానుబూతులు అంటాడు' అని అడిగాను.

ఆయన నవ్వి అన్నాడు. 'అవును అతను మాట్లాడే తెలుగులో బూతులున్న మాటల్లో అదొకటి. మీరు ఎవరి గురించి చెబుతున్నారో తెలుసు. వాళ్ళ నాన్న చాల స్పష్టంగా తెలుగు మాట్లాడే గొప్ప నటుడు. ఆయనతో ఒకసారి మీరన్నదే అన్నాను. ఆయన నవ్వి, 'మావాడిని నేనే వదిలేశాను. మీరూ వదిలేయటం మంచిది అన్నాడు'

ఏ మాత్రం నటనా చాతుర్యం లేకపోయినా, ఈ కొడుకులనీ కూతుళ్ళనీ రక్షిస్తున్నది నా ఉద్దేశ్యంలో ముఖ్యంగా ఒకటి. ఈ సినిమాల కథ. కథలు అని వ్రాద్దామనుకున్నాను కానీ కథలు ఏమిటి మరీ బహువచనం కూడానూ. ఒకే కథతో ఎన్నో ఏళ్ళబట్టి మన సినిమాలు తీస్తుంటే. అనగా అనగా రెండు రైతు కుటుంబాలు. ఆ రెండు కుటుంబాల మధ్యా చేతులూ, కాళ్ళూ, కొండొకచో తలలూ నరికేసుకునేంత వైరం. ఈలోగా ఒక కుటుంబం కూతురూ, ఇంకో కుటుంబం కొడుకూ, ఎవరెవరో ఎవరికి ఎవరో తెలుసుకోకుండానే న్యూజిలాండ్‌లో ప్రేమించుకోవటం, స్విట్జర్లాండ్‌లో రోడ్డు మీద కుప్పిగంతులు వేయటం, పెద్దవాళ్ళకి తెలిసి వాళ్ళు మళ్ళీ చేతులూ, కాళ్ళూ, కొండొకచో తలలూ నరికేసుకోవటం, జీపుల్లో పరిగెడుతున్న కథ మలుపు తిరిగబోయి బోర్లా పడటం, చివరికి ఒత్తులు పలుకలేని హీరో, అందరి చెంపలూ పగలగొట్టే హాస్య నటుడూ ఆడిన నాటకంతో సినిమా పూర్తిచేసి భళుం వేయటం. కుప్పిగంతులూ, ఫైటింగులతో వారి నటనయిపోయినట్టే.

కొడుకులు కూతుళ్ళు నటించటం మిగతారంగాల్లో రాణించటం ఏనాటినించో వుంది. పృధ్వీరాజ్‌కపూర్ కొడుకుల్లో ఇద్దరు మంచి నటులున్నారు. రాజ్ కపూర్, శశి కపూర్. జెమినీ గణేషన్ కూతురు రేఖ గొప్ప నటి. అశోక్‌కుమార్ తమ్ముడు కిశోర్‌కుమార్ మంచి నటుడు, గొప్ప గాయకుడు. స్వరరాజేశ్వరావ్ కొడుకులు కోటి, వాసూరావ్ మంచి సంగీత దర్శకులు. విజయనిర్మల కొడుకు నరేష్ చక్కటి హాస్య నటుడు. కాకపోతే ఏమాత్రం నటనా చాతుర్యం లేకుండా మామూలు డైలాగులు కూడా పలుకలేని స్థితిలో మన ప్రాణాలు తోడేసే నటులు - నటులు అనటం మంచి తెలుగు కాదేమో, తారలు అందాం, వీళ్ళ గురించే ఈ వ్యాసం.

మనదేశంలో జరిగిన, జరుగుతున్న విషయాలని నిశితంగా పరిశీలిస్తే వ్యక్తి పూజ అన్నది మన సంస్కృతిలో అనాది కాలం నించే వుంది. మన పురాణాల కాలం నించీనూ, చరిత్రలోనూ, ఇప్పుడు జరుగుతున్నవీ చూస్తుంటే ఆ వ్యక్తి పూజ అనేది ఒక తరంతో ఆగకుండా - ఆరుద్రగారి భాషలో - కొన్ని తరములసేపు మనల్ని వెంటాడుతూనే వుంది. బహుశా ఇది మనకి రాజులూ మహారాజులూ పెట్టిన బిక్ష అనుకుంటాను. ఒక రాజు పోతే అతని కొడుకు రాజవటం, అలా ఇంకో బలవంతు

డైన రాజు చేతికి చిక్కేదాకా అలా ఆ పరంపర కొనసాగటం. మనకి తోడుగా ఇంకా అలా వున్నది కొంతవరకూ బ్రిటిష్ వాళ్ళు. రాణీగారి ఇంపీరియల్ తోక పట్టుకుని ఇంకా వేళ్ళాడుతూనే వున్నారు.

మనదేశంలో ఇది ఒక్క సినిమా రంగంలోనే కాదు, ప్రతి రంగంలోనూ ఈ తరతరాల దంపుడు బాగా వుంది. బిర్లాకి కొడుకు పుట్టినా, తాతాకి మనవడు పుట్టినా దేశంలో ఒక వ్యాపారవేత్త పుట్టినట్టు. ఒక గొప్ప మేనేజర్ పుట్టినట్టు. అతనికి ఆ లక్షణాలూ, ఉత్సాహం, అర్హతా వున్నాయా లేవా అన్నవాటితో పనిలేదు.

నెహ్రూ, ఇందిర, మనేక, రాజీవ్, సోనియా... ఈ వంశ పరంపర ఇంకా ఎన్ని తరాలు వెడుతుందో వేచి చూడాల్సిందే అలాగే మిగతా కొంతమంది రాజకీయ నాయకులు. మీ చిన్న బుష్ ఎన్నికవలేదా అలాగే అనే వాదన కూడా అంత సరైనది కాదు. ఎందుకంటే రాజీవ్‌లాటి రాజకీయాల్లో అనుభవంలేని వ్యక్తి కేవలం ఇందిర కొడుకు అయినందువల్లా, అభిమానుల ఉద్రేకంవల్లా ఎన్నికలలో గెలిచాడు. టెక్సాస్‌కి గవర్నర్‌గావున్న చిన్న బుష్, పెద్ద బుష్ ప్రమేయం లేకుండా ప్రిలిమినరీలలో ఇంకో నలుగురితో పోటీ చేసి, ఎన్నికలలో నుంచోటానికి అర్హత సంపాదించాడు. తర్వాత ఎన్నికలలో గెలిచాడు. ఈ ఎన్నికలలో మంచీచెడూ గురించి ఇంకోసారి మాట్లాడుకుందాం.

ఈ తరతరాల బాదుడు సినిమారంగంలో మరీ ఎంతో ఎక్కువగా, వ్యాపార రాజకీయ రంగాల్లో ఎక్కువగా కనిపిస్తుంది. సాహిత్యం, సంగీతం, నృత్యం లాటి కళలలో, క్రీడారంగంలో అక్కడక్కడా సత్తాలేనివాళ్ళు కనిపించినా, రాణించ టానికి ప్రావీణ్యం అవసరం. భమిడిపాటి కామేశ్వరావ్‌గారి కొడుకు రాధాకృష్ణ, రవిశంకర్ కూతురు అనుష్కా శంకర్, మృణాలినీ సారాభాయ్ కూతురు మల్లికా సారాభాయ్, లాలా అమర్‌నాథ్ కొడుకు మొహీందర్ అమర్‌నాథ్‌లాటి వారన్నమాట.

పండిత పుత్రులు శుంఠలవచ్చు. కాకపోవచ్చు. శుంఠలయితే పైన చెప్పిన సినిమా, రాజకీయ, వ్యాపార రంగాల్లో రాణించటానికి డబ్బులు ఖర్చు పెట్టి కష్టపడొ చ్చేమోకానీ, లలిత కళల్లో నిజంగా కష్టమే.

ఇది వ్రాస్తుంటే ఎప్పుడో విన్న జోకు గుర్తుకి వస్తున్నది. ఒక చిన్న కంపెనీ వార్షికోత్సవం జరుగుతున్నది. ఆ కంపెనీ ఓనరాసురుడు సభాముఖంగా ఉపన్యాసం ఒప్పచెబుతున్నాడు. 'మన కంపెనీలో మీరు కష్టపడి పనిచేస్తే పైకి రావటం సులభం. నేనే మిమ్మల్నీ, మీ పనితనాన్నీ గుర్తించి ప్రమోషన్లు ఇస్తాను. ఉదాహరణకి, నా పక్కన కూర్చున్న యువకుడిని చూడండి. ఆరు నెలల క్రితం మన కంపెనీలో చిన్న ఉద్యోగిగా చేరాడు. నెలరోజుల్లో సూపర్‌వైజర్ అయాడు. మూడు నెలల్లో మేనేజర్ అయాడు. బాగా కష్టపడి పనిచేసి ఐదు నెలలు నిండకుండానే జనరల్ మేనేజర్ అయాడు... ఏమయ్యా నువ్వేమైనా చెబుతావా?' అని అతన్ని అడిగాడు.

నెలలు నిండకుండానే పదవులు బాసిన ఆ నిండుకుండ తొణక్కుండా, సిగ్గుపడుతూ 'నేను చెప్పేదేం లేదు డాడీ' అన్నాడు.

0 0 0